క్లుప్తంగా

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు

పెద్దాపురం: యువత తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పెద్దాపురం మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ (ఎంసీసీ) కన్వీనర్, ఎంపీడీఓ జి.ఉషారాణి అన్నారు. స్వీప్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్ విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నదే స్వీప్ ప్రధాన లక్ష్యమన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో నూరు శాతం పోలింగ్ లక్ష్యంగా స్వీప్ పని చేస్తుందని, ఇందుకు ప్రతి ఓటరు సహకరించాలని కోరారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ నక్కా సత్యనారాయణమూర్తి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

పెద్దాపురం: భువనేశ్వరి పీఠం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి అన్నారు. వేసవి ఎద్దడి నేపథ్యంలో ఆదివారం స్థానిక మెయిన్ రోడ్డులో ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గోపిశర్మ మాట్లాడుతూ భువనేశ్వరి పీఠం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామన్నారు.

నూకాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు



నూకాలమ్మ అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి దర్శనానికి మూడో ఆదివారం భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్య మాసాన్ని పురస్కరించుకుని సుమారు 45 రోజుల పాటు నిర్వహించే జాతర మహోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్ గవరసాని వీరాస్వామి, ఈఓ తలాటం వెంకట సూర్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పెద్దాపురం సీఐ రవికుమార్ పర్యవేక్షణలో ఎస్సై వెలుగుల సురేష్ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో యాత్రికులకు మజ్జిగ, పాలు పంపిణీ చేశారు.

జోరుగా.. హుషారుగా..

- పుంజుకుంటున్న వరి కోతలు
- 60 శాతం పూర్తయిన పనులు
- పెరిగిన దిగుబడితో రైతుల్లో ఆనందం
- 48 గంటల్లోనే అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో ధాన్యం సొమ్ము



సామర్లకోట మండలం అచ్చంపేటలో మెషీన్‌తో చేస్తున్న వరి కోతలు

సామర్లకోట: దాళ్వా వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. సామర్లకోట మండలంలో 22,200 ఎకరాల్లో వరి సాగు చేశారు. వీటిలో 80 శాతం బొండాలు సాగు చేయగా, మిగిలిన భూముల్లో సన్న రకాలైన ఎంటీయూ 1153, ఎంటీయూ 1156, ఆర్‌ఎన్‌ఆర్ 15048 రకాలను సుమారు 4 వేల ఎకరాల్లో దాళ్వా సాగు చేపట్టారు. ప్రతి పంటకు వ్యవసాయ అధికారులు రోస్టర్ పద్ధతిలో వరి కోత ప్రయోగాలను చేశారు. వీటి ఆధారంగా ఎకరానికి సన్నాలు 45 నుంచి 50 బస్తాలు, బొండాలు 50 నుంచి 55 బస్తాలు దిగుబడి వస్తున్నట్టు వారు పేర్కొన్నారు. సన్నాలను గ్రేడ్–ఏ గాను, బొండాలను సాధారణ రకంగా గుర్తిస్తారు. వాతావరణం పంట కోతలకు అనుకూలంగా ఉండటంతో పాటు, ప్రస్తుత దాళ్వా సాగులో నీటి ఎద్దడి లేక పోవడం వల్ల రైతులు ఆనందంలో ఉన్నారు. పెద్దాపురం మండలంలో 8,300 ఎకరాల్లో దాళ్వా సాగు చేశారు. వీటిలో 60 శాతం బొండాలు, 40 శాతం సన్న రకాలు వేశారని మండల వ్యవసాయాధికారి సంజయ్‌కుమార్ తెలిపారు. ఇప్పటి వరకు 4,200 ఎకరాల్లో వరి కోతలు పూర్తి కాగా, ఎకరానికి 40 నుంచి 45 బస్తాల దిగుబడి వస్తున్నట్టు చెప్పారు.

వరి కోత మెషీన్లు అందుబాటులో ఉన్న రైతులు వాటి ద్వారానే కోతలు చేసుకుంటున్నారు. తుని, తొండంగి, కోటనందురు ప్రాంతాల్లో దాళ్వా సాగు అంతంతమాత్ర. అక్కడ వరి కోత మెషీన్లు అందుబాటులోకి రావడంతో, వరి కోత యంత్రాల కొరత లేకుండా పోయింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మండలంలో ఐదు వరి కోత యంత్రాలను సబ్సిడీపై ఇవ్వడంతో, కోత మెషీన్లు ఇక్కడి రైతులకు అందుబాటులోకి వచ్చాయి. మండలంలో 60 శాతం వరి కోతలు పూర్తయినట్టు మండల వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కోతలు పూర్తి చేసుకున్న వారు ధాన్యాన్ని రోడ్లపై, పొలాల్లోను ఆరబెడుతున్నారు. వరి కోతలు పూర్తయితే గోదావరి కాలువను మూసివేస్తారు. దాంతో దాళ్వా కోతలు పూర్తి చేసుకున్న రైతులు.. అపరాల సాగుకు సన్నద్ధమవుతారు. కొంత మంది రైతులు తమ భూముల్లో సారవంతాన్ని పెంచేందుకు పచ్చిరొట్టను సాగు చేసి, దుక్కి చేస్తారు.



ఏడీబీ రోడ్డులో ధాన్యం ఆరబెడుతున్న రైతులు



ఆర్బీకేలకు తరలించడానికి ధాన్యం లోడింగ్ చేస్తున్న సామర్లకోట రైతులు

వాతావరణం అనుకూలించింది



ప్రస్తుత దాళ్వా సీజన్‌లో రైతులు ఎక్కువగా బొండాలు సాగు చేశారు. మండలంలోని మూడు ఎత్తిపోతల పథకాల పరిధిలోని రైతులకు సమృద్ధిగా నీరందింది. రైతులకు అందుబాటులో వరి కోత యంత్రాలు ఉండటంతో, ప్రస్తుతం సన్నాలు వరి కోతలు పూర్తయ్యాయి. బొండాలు కోతలు జోరుగా జరుగుతున్నాయి. రైతులకు అందుబాటులో ప్రతి గ్రామంలోను రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. రైతులకు వేగంగా ధాన్యం సొమ్ము చెల్లింపులు జరుగుతున్నాయి.

– తలారి దొరబాబు, రైతు సంఘ నాయకుడు, వీకే రాయపురం

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం



మండలంలో ప్రతి గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. మండలంలో 21 రైతు భరోసా కేంద్రాలుండగా, 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల ధాన్యం తేమ శాతం సమస్య ఎక్కువగా ఉండే అవకాశం లేదు. మండలంలో బొండాలు 80 శాతం సాగు చేశారు. 70 శాతం మంది రైతులు వెదజల్లు పద్ధతిలో సాగు చేయడం వల్ల పెట్టుబడి తగ్గే అవకాశం ఉంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యానికి 48 గంటల్లో నగదు ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమవుతుంది. గ్రేడ్–ఏ 100 కేజీల బస్తాకు రూ.2,203, 75 కేజీల బస్తాకు రూ.1,652, సాధారణ రకం 100 కేజీల బస్తాకు రూ.2,183, 75 కేజీల బస్తాకు రూ.1,637 గిట్టుబాటు ధర నిర్ణయించారు. ప్రతి రైతూ ఆర్బీకేలను సద్వినియోగం చేసుకోవాలి.

– ఐ.సత్య, మండల వ్యవసాయాధికారి, సామర్లకోట

హామీలన్నీ అమలు చేసిన సీఎం జగన్

- పి.వేమవరంలో జెడ్పీటీసీ ఎన్నికల ప్రచారం



పి.వేమవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు అమృత

సామర్లకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి చూపించారని జెడ్పీటీసీ ఎలిశెట్టి అమృత అన్నారు. ఆదివారం సాయంత్రం పి.వేమవరం గ్రామంలో ఆమె పెద్దాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు, కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన చేసి చూపించారన్నారు. మోసపూరిత హామీలతో కూటమి నేతలు వస్తారని, జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు ఆమె సూచించారు. ఎమ్మెల్యే అభ్యర్థి దొరబాబు స్థానికుడు కావడంతో నియోజకవర్గ ప్రజలు ఆయన వద్ద తమ సమస్యలు సులువుగా పరిష్కరించుకోవచ్చన్నారు. అదేవిధంగా సునీల్ ఎంపీగా గెలిస్తే, నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ మేరకు 400 గ్రామాలను దత్తత తీసుకుని, ప్రతి గ్రామాన్ని రూ.కోటితో అభివృద్ధి చేస్తానని ఆయన హామీ ఇచ్చారని చెప్పారు. ప్రజలకు మంచి జరగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ నాయకుడు ఎలిశెట్టి నరేష్, సర్పంచ్ ఎలిశెట్టి నూకరత్నం, ఎంపీటీసీ కేశవరపు వీరమణి, ఉప సర్పంచ్ అత్తిలి సుబ్బలక్ష్మి, మాజీ ఉప సర్పంచ్ ఎలిశెట్టి భీమన్నదొర, దివాకర్, బాబ్జీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం జరిగింది.

సంక్షేమాన్ని చూసి ఓటు వేయండి



ప్రచారంలో ఎంపీ వంగా గీతకు పూలదండ వేసి సాదరంగా స్వాగతిస్తున్న స్థానిక మహిళ

- వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి, ఎంపీ వంగా గీత
- పిఠాపురం మండలంలో ఎన్నికల ప్రచారం

పిఠాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమాన్ని చూసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి, ఎంపీ వంగా గీత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆమె పిఠాపురం మండలంలోని నర్సింగపురం, జములపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఆమెకు ఇంటింటా మహిళలు హారతులిచ్చి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఇంటింటికీ మంచి చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుందామన్నారు. అందరికీ అందుబాటులో ఉండే తనకు అవకాశం కల్పించాలని, పిఠాపురం ప్రజల ఆడబడుచుగా అందరికీ సేవ చేసుకునే భాగ్యం కల్పించాలని కోరారు. ఏ అవసరం వచ్చినా మీ ఇంటికి నేరుగా వచ్చి సాయం అడిగే అవకాశం తమకు ఉందని మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. అందుకే మాకు మీరే కావాలి వైఎస్ జగన్‌నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటూ స్థానికులు ముక్త కంఠంతో చెప్పారు. వార్డులో ప్రతి ఇంటికి వెళ్లిన ఆమె ఇప్పటివరకు తాను పిఠాపురం మండలంలో చేసిన అభివృద్ధిని వివరించారు. నర్సింగపురానికి చెందిన టీడీపీ నాయకుడు ఇజ్జన రత్నం తన అనుచరులతో కలిసి ఎంపీ వంగా గీత సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయనకు వైఎస్సార్ సీపీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జములపల్లి సర్పంచ్ పెద్దింటి రజని, ఉలవల భూషణం, ఓలేటి పాపిరెడ్డి, రాయుడు చిన్న, పెద్దింటి సూర్యప్రభ, రాయుడు చాందిని తదితరులు పాల్గొన్నారు.



జములపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ వంగా గీత

మరో అవకాశం ఇవ్వండి

- స్థానికుడిని.. మీలో ఒక్కడిని.. నన్ను గెలిపించండి
- దివిలిలో పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి ఎన్నికల ప్రచారం



పెద్దాపురంలో ఓటు వేయాలని మహిళను అభ్యర్థిస్తున్న దొరబాబు

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మరో అవకాశం కల్పించాలని పార్టీ పెద్దాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. ఆదివారం మండలంలోని ఉలిమేశ్వరం, పట్టణంలోని మూడు, నాలుగు, ఆరు వార్డుల్లో ఆయన ఇంటింటికీ తిరిగి ఓట్లను అభ్యర్థించారు. సర్పంచ్ ఆకుల వీరబాబు, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, తాడి రాజశేఖర్, కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ గోపు మురళి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ.. మీలో ఒక్కడిని.. స్థానికుడిని.. నియోజకవర్గ ప్రజలకు పరిచయస్తుడైన నన్ను ప్రతిఒక్కరూ ఆదరించి, ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను దృష్టిలో పెట్టుకుని వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరో దఫా వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, కనపర్తి చీమదొర, గోలి రామారావు, పెంటా విజయ్‌కుమార్, సుందరెడ్డి రాజు, కనపర్తి శ్రీనివాస్, వాసిరెడ్డి శ్రీనివాస్, నాగబోయిన రాజుబాబు, లక్కాకుల నానాజీ, కుంచే వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన కోసం నా భర్తను గెలిపించండి

సామర్లకోట: రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగడానికి తన భర్తను ఎమ్మెల్యేగా గెలిపించాలని పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు భార్య చంద్రకళ ఓటర్లను విజ్ఞప్తి చేశారు. కాపవరం గ్రామంలో ఆదివారం ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, సర్పంచ్ కుంచం మాధవరావు ఆధ్వర్యంలో ఆమె తన భర్త దొరబాబు తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఆమెకు గ్రామ ప్రజలు స్వాగతం పలికారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, ఆమె ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా ఎన్నికల్లో పోటీ చేసేందుకు దొరబాబు యత్నించగా, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇచ్చారని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, దొరబాబును అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. స్థానికుడైన దొరబాబుకు ప్రజల సమస్యలపై అవగాహన ఉందని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలను మోసం చేయడానికి వచ్చే వారిని నమ్మవద్దని హితవు పలికారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిస్తే.. సంక్షేమ పథకాన్నీ కొనసాగుతాయని వివరించారు. విద్య వ్యాపారం కారాదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను పూర్తిగా మార్చారని వివరించారు. ప్రజల కోసం పని చేసే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, ఎంపీటీసీ గుర్తుల కృష్ణార్జునరావు, కౌన్సిలర్లు పెండ్యాల నాగవెంకటలక్ష్మి, రెడ్డి లోవకుమారి, గృహ సారథుల కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి తదితరులు పాల్గొన్నారు.



కాపవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దవులూరి చంద్రకళ

మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆదరించండి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గీత, సునీల్
- జనసేన, టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో 200 కుటుంబాల చేరిక



వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్

కొత్తపల్లి: సంక్షేమ పథకాలతో ఇంటింటికీ మంచి చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ అన్నారు. మండలంలోని కొత్తమూలపేటలో ఆదివారం రాత్రి మేమంతా సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. పీవీ రావు మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సలాది బాబులు జనసేన పార్టీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయనతో పాటు జనసేన, టీడీపీకి చెందిన 200 కుటుంబాలు చేరాయి. వారికి వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ మీ ఇంట్లో మంచి జరిగితేనే ఓటు వేయండమ్మ, లేకపోతే వద్దని చెప్పే ధైర్యం రాజకీయాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తప్ప మరెవరికి లేదన్నారు. గతంలో ప్రభుత్వ సేవలంటే కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పనులు జరగని పరిస్థితులుండేవన్నారు. కాని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను అందిస్తున్నారన్నారు. పేదల కోసం ఒక్క మంచి పని కూడా చేయలేని చంద్రబాబు తాను ఎన్నికల్లో గెలవలేనని తెలిసి కూటమి పేరుతో ఓటర్లను ఆకర్షించేందుకు గారడీలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ మాట్లాడుతూ సంక్షేమం అందాలంటే జగనన్నే ముఖ్యమంత్రిగా ఉండాలనే నిర్ణయానికి ప్రజలు వచ్చేశారన్నారు. తన సొంత మేనిఫెస్టోలో కాకినాడ పార్లమెంటు పరిధిలో 5,000 నుంచి 6,000 మందికి ఉద్యోగాలు తెప్పించేందుకు సుమారు రూ.30,000 కోట్ల నుంచి రూ.40,000 కోట్లతో పరిశ్రమలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు. పార్లమెంటు పరిధిలోని 400 గ్రామాల్లో ప్రతి గ్రామానికి రూ.కోటి నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల వ్యవసాయ అడ్వైజరీ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, మాజీ సర్పంచ్ వడ్డి నాగమణి, మచ్చ శాల్మన్ రాజు, మాత విజయకుమారి, రాయుడు సత్తిబాబు, రావూరి వెంకటేశ్వరరావు, గండేపల్లి బాబి తదితరులు పాల్గొన్నారు.

మార్వాడీలకు అండగా వైఎస్సార్ సీపీ

పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి



మార్వాడీల సంఘీభావ సమావేశంలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి నియోజకవర్గంలో స్థిరపడిన మార్వాడీలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని పాపార్టీ పెద్దాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. ఆదివారం రాత్రి మార్వాడీల విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గంలోని జైన్లు, మార్వాడీలు వైఎస్సార్ సీపీ అభ్యర్థి దవులూరి దొరబాబుకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ సామర్లకోటకు చెందిన వ్యక్తిగా మార్వాడీల సమస్యలపై తనకు పూర్తిగా అవగాహన ఉందన్నారు. మార్వాడీలు తమ కుటుంబ సభ్యునిగా ఆదరించారని కృతజ్ఞతలు తెలిపారు. మార్వాడీల ప్రతి కార్యక్రమానికి తనను ఆహ్వానించాలన్నారు. కుల, మతాలకతీతంగా అందరికీ న్యాయం చేస్తున్న ముఖ్యమంత్రిపై ప్రతి ఒక్కరూ నమ్మకం ఉంచాలన్నారు. ఈ సందర్భంగా దొరబాబును మార్వాడీ సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ చాంబర్ మాజీ చైర్మన్, జై భారత్ నేషనల్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర, రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

గొల్లప్రోలు: పట్టణంలోని 12వ వార్డులో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గత ఐదేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల కారణంగా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో గండ్రేటి శ్రీరామ చంద్రమూర్తి, మొగలి అయ్యారావు, జ్యోతుల భీముడు, మైనం రాజా, గంధం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సంగీతం, నృత్య శిక్షణా తరగతుల ప్రారంభం

గోకవరం: యువత భారతీయ ప్రాచీన కళలను అభ్యసించాలని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో యువతకు కర్నాటక సంగీతం, కూచిపూడి నృత్య శిక్షణా తరగతులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీనకళలకు పూర్వవైభవం తీసుకురావాలనే ఉద్దేశంతో కళాభారతికి వందనం పేరుతో నామమాత్రపు రుసుముతో ఈ శిక్షణా తరగతులను ప్రారంభించామన్నారు. సుమారు 350 మంది ఈ శిక్షణా తరగతులకు నమోదు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న యువత భక్తిశ్రద్ధలతో అభ్యసించి నైపుణ్యం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దాసరి తమ్మన్నదొర, వరసాల ప్రసాద్, దాసరి ధర్మరాజు, గురువులు కోట దివాకర్, నెల్లిపూడి ధనలక్ష్మి, సమితి సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్నదొర తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక.. ఆనంద డోలిక..

- పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వాకతిప్ప జిల్లా పరిషత్ పాఠశాలలో కలుసుకున్న 2003-04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2003–2004 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. జీవితంలో ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా సుమారు 21 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలో తిరిగి కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించుకున్నారు. మధ్యాహ్నం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. పాఠశాల అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్న స్టేజ్‌కు రూ.50 వేల ఖర్చుతో షెడ్డు వేయించారు.